గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సుంకిశాలలో పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి, జనవరి 23 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఇందుకు అన్ని గ్రామాల్లో రివ్యూ సమావేశాల్లో ఏర్పాటు చేస్తానని తెలిపారు. మండలంలోని కేతేపల్లి,మేళ్లవాయి, ఫకీర్‌పురం, సుంకిశాల, చల్లవానికుంట గ్రామాల్లో పంచాయతీ భవనాలను, బండతిమ్మాపురంలో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, పస్నూర్,నర్సింహులగుడెంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బెల్టు దుకాణాలు లేకుండా గ్రామస్తులు చొరవ చూపాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారంతో ప్రభుత్వం నుంచి అధిక మొత్తంలో నిధులు తెచ్చి మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఏడుదొడ్ల శ్వేత, జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి ,పానగంటి వెంకన్న, పూల వెంకటయ్య, ఏరేడ్ల రఘుపతిరెడ్డి, పెద్దిరెడ్డి రాజు, సర్పంచెలు కోరె హేమలత యాదయ్య, గుండెబోయిన మైవమ్మానారాయణ. బాషిపాక రాములు, అందుగుల కవితాయాదయ్య, పోగుల దివ్య,రాపోతు సత్యనారాయణ, బల్గూరి విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే వీరేశం

టీయూటీఎఫ్ డైలీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జనవరి 23 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో మంగళవారం టీయూటీఎఫ్ 2024 క్యాలెండర్, డైరీను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్‌రావు, సంఘం జిల్లా అధ్యక్షుడు వి. లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బానాల రాంరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు పోతుల వెంకటనారాయణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు కోట మల్లయ్య, ఎస్.మురళి పాల్గొన్నారు.

ప్రజల అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలి

● కలెక్టర్ హరిచందన

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ రూరల్, జనవరి 23 : ప్రజల అవసరాల మేరకు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల చేపట్టాలని కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు,పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 8 మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రారంభించాల్సిన పనులు,ప్రతిపాదిత పనులు,బడ్జెట్ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుకున్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్‌పాటిల్, నల్లగొండ ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రవి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, ఈఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

క్యారం ఆడుతున్న ఆలయ ఉద్యోగులు

యాదగిరిగుట్ట దేవస్థానం ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

యాదగిరిగుట్ట, జనవరి 23 : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం దేవస్థానంలో విధులు నిర్వర్తించే ఏఈఓ, పర్యవేక్షకులు, ఇతర సిబ్బంది జట్లుగా ఏర్పడి క్రికెట్, క్యారమ్, చదరంగం పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నెల 25వరకు ఆటల పోటీలు కొనసాగుతాయని ఆలయ ఈఓ రామకృష్ణారావు వెల్లడించారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలూనాయక్

మాల్, జనవరి 23 : అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. మంగళవారం చింతపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి లబ్ధిదారుల ఎంపికను అధికారులే చేపట్టాలని, ఇందులో మధ్య వర్తుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. అక్రమాలకు పడిడే సహించేది లేదని హెచ్చరించారు. పదవీకాలం పూర్తవుతున్న సర్పంచులు, ఎంపీటీసీలను ఆయన సన్మానించారు. అనంతరం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ కొండూరి భవానీపవన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీటీసీ కంకణాల ప్రవీణావెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ యాచారపు యాదగిరి, తాసీల్దార్ శంషొద్దీన్, ఎంపీడీఓ రాజు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

దేవరకొండ : పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ కోరారు. మంగళవారం పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో నిర్వహించిన పట్టభద్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2019 కంటే ముందు డిగ్రీ పట్టా పొందిన ప్రతి ఒక్కరూ తాసీల్దార్ కార్యాలయాల్లో లేదా ఆన్‌లైన్‌లో ఓటుహక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి, డాక్టర్ వేణాధర్‌రెడ్డి, ముక్కమల్ల వెంకటయ్య, పున్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

మిర్యాలగూడ, జనవరి 23 : పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అరుణ కుమారి తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 5వ తరగతి మైనార్టీ విద్యార్థినులకు 60 సీట్లు, ఇతరులకు 20 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు గానూ ప్రతి గ్రూపులో 30 సీట్లు మైనార్టీలకు, 10 సీట్లు ఇతరులకు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మైనార్టీ గురుకుల విద్యార్థి

సాయి మనోజ్

గుర్రంపోడు, జనవరి 23: మండలంలోని పిట్టలగూడెం గ్రామంలోని మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థి సాయి మనోజ్ జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూక్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 28 వరకు కర్ణాటకలో జరిగే అండర్ -19 జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో సాయి మనోజ్ మన రాష్ట్రం తరపున ఆడనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్రవ్యాప్తంగా బెల్టు షాపులను మూసివేయించాలి : ఐద్వా

రామగిరి, జనవరి 23: మునుగోడు తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం బెల్ట్ దుకాణాల ఎత్తివేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో 'విచ్చలవిడి బెల్టు షాపులు-పెరుగుతున్న నేరాలు' అనే అంశంపై ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో గంజాయి డ్రగ్స్ ప్రభావం విపరీతంగా ఉందని వీటి పైన కూడా ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేకమైన దృష్టి పెట్టి నియంత్రించాలని కోరారు.బెల్ట్ షాపులో ఎత్తివేత కోసం జిల్లావ్యాప్తంగా కార్యాచరణ చేపట్టి బెల్ట్ షాపుల నిషేధిత ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని వారన్నారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు జిట్టా సరోజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భూతం అరుణ కుమారి, పాదురి గోవర్ధన, చేనబోయిన నాగమణి, తుమ్మల పద్మ, బహురోజు ఇందిరా, ఎస్‌కే సుల్తానా, బొల్లెపల్లి మంజుల పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

● ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

అడవిదేవులపల్లి, జనవరి 23 : అడవిదేవులపల్లి మండలం నియోజకవర్గ కేంద్రానికి దూరంగా ఉన్నందున ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు మందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. దున్నపోతుల గండి లిఫ్ట్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో తాసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీఓ మసూద్ షరీఫ్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా డబ్బులు ఇప్పించండి

● ఉన్నతాధికారులకు పోస్టల్ బాధితుల వినతి

పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

నందికొండ, జనవరి 23 : నందికొండ పైలాన్‌కాలనీలోని పోస్టాఫీస్‌లో తాము డిపాజిట్ చేసుకున్న డబ్బులను కాజేసిన సబ్ పోస్ట్‌మాస్టర్ రామకృష్ణపై చర్యలు తీసుకొని తమ డబ్బులు ఇప్పించాలని కోరుతూ బాధితులు మంగళవారం జిల్లా కేంద్రంలో పోస్టల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పైలాన్ కాలనీ సబ్ పోస్ట్ మాస్టర్ చేతి వాటం ప్రదర్శించి తమ ఖాతాల నుంచి రూ. 1.50 కోట్లను కాజేసినట్లు తెలిపారు. ఈ విషయమై అధికారులు విచారణ చేపట్టి నెల రోజులవుతున్నా ఎలాంటి చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేవారు. పైలాన్ పోస్టాఫీస్‌లో రెండేండ్లుగా ఖాతాదారుల నగదు మాయమవుతున్న విషయం ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోక పోవడం వల్లే సదరు సబ్ పోస్ట్‌మాస్టర్ భారీగా డబ్బులను కాజేశాడని వాపోయారు. ఈ విషయంలో విచారణ వేగవంతం చేసి తమ డబ్బులు ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఖాతాదారులకు సంబంధించిన డబ్బులను పోస్టల్‌శాఖ చెల్లింస్తుందని, బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నగదు మాయం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేస్తామని అడిషనల్ ఎస్పీ విఠల్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాధితులు సంపూర్ణమ్మ, చెన్నకేశవులు, చెన్నయ్య, రమణ, శివ, సనీమ, మల్లేశ్వరి, శివ, సైదులు, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేయాలి

● మాజీ ఎమ్మెల్యే జూలకంటి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జనవరి 23: నాగార్జునసాగర్ ఎడమకాల్వకు తక్షణమే నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా వాగులు, చెరువులు ఎండిపోయి భూ గర్భజలాలు తగ్గాయన్నారు. దాంతో బోర్లు, బావుల్లో నీరు లేక ఆయకట్టులో వేసిన వరి చేలు ప్రస్తుతం ఎండిపోయే దశకు చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ ప్రాజెక్ట్‌లో 520 అడుగుల నీరు ఉన్నందున 15 టీఎంసీలు వాడుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 10 రోజుల పాటు ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి చెరువులు నింపి వరి పంటలను కాపాడాలని, ప్రజల తాగునీటి ఇబ్బందులను తొలగించాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేశ్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్‌చంద్ర, రాగిరెడ్డి మంగారెడ్డి, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రెమడాల పరశురాములు, వినోద్‌నాయక్, శశిధర్ రెడ్డి, తిరుపతి రామ్మూర్తి, ఎండీ. అంజద్, పగిడోజు రామ్మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి : డీఈఓ భిక్షపతి

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా విద్యా శాఖ అధికారి భిక్షపతి

హాలియా, జనవరి 23 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీఈఓ భిక్షపతి సూచించారు. మండల కేంద్రంలోని ట్రైం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత స్థానానికి చేరవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శోభన్‌బాబు, పాఠశాల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఐదుగురు నిందితులు అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

నకిరేకల్, జనవరి 13 : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు, ముగ్గురు విద్యార్థులను అరెస్ట్ చేసినట్లు నకిరేకల్ పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నకిరేకల్ పట్టణానికి చెందిన వహీద్, కృష్ణ ఆంధ్రా ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయి తీసుకొచ్చి నకిరేకల్ ప్రాంతంలో అమ్ముతున్నారు. నారాయణరెడ్డి ఫంక్షన్ హాల్ పరిసర ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు కట్టంగూర్, అడ్డగూడూరు, నకిరేకల్ మండలాలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు విక్రయిస్తుండగా పట్టుబడారు. వీరి నుంచి మొత్తం 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.6 వేల వరకు ఉంటుందన్నారు. తాసీల్దార్ గుగులోతు ప్రసాద్ నాయక్ పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. ఐదుగురిని కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ గోపికృష్ణ, సుధీర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్

రద్దీకి అనుగుణంగా బస్సులను నడుపాలి

● ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్

నల్లగొండ సిటీ, జనవరి 23 : ఆర్టీసీలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకాన్ని ఆటంకం లేకుండా కొనసాగించాలని ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్ తెలిపారు. నల్లగొండకు వచ్చిన ఆయన మంగళవారం బస్టాండ్‌లోని పలు విభాగాలను పరిశీలించారు. ఆనంతరం రీజియన్‌లోని పలు డిపోల డీఎంలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో రద్దీ పెరిగిందని, దానికి అనుగుణంగా అధికారులు బస్సులు నడుపాలన్నారు. బస్టాండ్‌లలో పరిశుభ్రత పాటించాలని తెలిపారు. బస్టాండ్ స్టాళ్లల్లో వస్తువులు ఎంఆర్‌పీ రేట్లకు అమ్మేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కొత్త బస్సులను కొనుగోలు చేస్తుందని, త్వరలో రీజియన్ వ్యాప్తంగా నూతన బస్సులు రానున్నాయని తెలిపారు. ఆర్టీసీ ఆదాయం పెంపునకు ఖాళీ స్థలాలు షాపులు అద్దెకు ఇచ్చి ఆదాయం పెంపుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్ఎం శ్రీదేవి, డీవీఎంలు మాధవి, శివశంకర్, డీఎంలు రాంమోహన్‌రెడ్డి, పాల్, రాజీవ్‌ప్రేమ్‌కుమార్, హర్ష, వెంకటమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలు చేయలేకనే సీఎం విదేశీ పర్యటనలతో కాలయాపన : మాజీ ఎంపీ బూర

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

నల్లగొండ రూరల్,జనవరి 23 : కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయలేకనే సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలతో కాలయాపన చేస్తున్నారని బీజేపీ జాతీయ సభ్యుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే వరకు ఇదే విధానంలో కాలయాపన చేస్తారని విమర్శించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరి స్థానాలలో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గల్లీలో ఎవరు ఉన్నా ఢిల్లీలో మాత్రం మోదీ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. పెద్ద పెద్ద మాటలు చెప్పే జిల్లా మంత్రులు ఇద్దరు ఎస్ఎల్‌బీసీ సొరంగం,ఇతర నీటి ప్రాజెక్టులు ఎప్పటి లోగా పూర్తి చేస్తారో ప్రజలకు చెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్, యాదగిరాచారి, దర్శనం వేణు, పాశం శ్రీనివాస్‌రెడ్డి, చింత ముత్యాలు రావు, పెరిక మునికుమార్, వెంకన్న గౌడ్, పాల్గొన్నారు.

పోచంపల్లిలో ఇక్కత్ వస్త్రాల తనిఖీ

● డూప్లికేట్ చీరెల అమ్మకాల నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల రాక

పోచంపల్లిలోని వస్త్ర దుకాణంలో చీరెలను తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

భూదాన్ పోచంపల్లి, జనవరి 23 : భూదాన్ పోచంపల్లిలో ఇక్కత్ వస్త్ర దుకాణాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. 15 మంది బృందంతో ఏకకాలంలో 12 షాపులపై దాడి చేశారు. ఇక్కత్ వస్త్రాలను పోలిన ప్రింటింగ్ చీరెలు విక్రయిస్తున్నారనే సమాచారంతో తనిఖీలు చేసి సీజ్ చేశారు. 12 వస్త్ర దుకాణాల వారికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా స్టేట్ లెవెల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, రాష్ట్ర చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ మునాసు వెంకటేశం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేనేత మగ్గాలపై తయారు చేయడానికి 11 రకాల చేనేత డిజైన్లను రిజర్వ్ చేసిందని, అందులో పోచంపల్లి ఇక్కత్ డిజైన్లు ఒకటి అని తెలిపారు. ప్రపంచంలో మొట్ట మొదటి సారిగా చేనేతకు భౌగోళిక గుర్తింపు వచ్చిందని, పోచంపల్లి చేనేత సహకార సంఘం, టై అండ్ డై ట్రేడర్ అసోసియేషన్‌కు ఉమ్మడిగా(భౌగోళి గుర్తింపు) ఇచ్చారని చెప్పారు. ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల ప్రొడక్షన్‌ను ప్రింటెడ్ రూపంలో మరమగ్గాలపై తయారు చేసి చేనేత వస్త్రాలని చెప్పి విక్రయిస్తున్నారని అన్నారు. ఇక్కత్ వస్త్రాలు పోలిన డూప్లికేట్ చీరెలను గుర్తించి 12 షాపుల్లో సీజ్ చేసి నోటీసు అందిసినట్లు తెలిపారు. పట్టుబడ్డ నకిలీ వస్త్రాలను చెన్నైలోని ల్యాబ్‌కు టెస్టింగ్ పంపిస్తామని, పవర్ లూమ్ ప్రింటింగ్ వస్త్రాలను తయారు చేస్తున్న కంపెనీలపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇక్కత్ వస్త్రాలను పోలిన డూప్లికేట్ చీరలను అమ్మొద్దని హెచ్చరించారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చేనేత వస్త్రాలకు హ్యాండ్లూమ్ మార్క్, సిల్క్ మార్క్ ఉంటేనే ఒరిజినల్ క్వాలిటీకి నిదర్శనమని, చేనేత వస్త్రాలు తయారుచేసే తయారీదారులు రిజిస్టర్ చేసుకుని లోగోలను వినియోగించు కోవాలని సూచించారు. వారి వెంట జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ విద్యాసాగర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రసాద్, అధికారులు సంధ్యారాణి, సాయికుమార్, అనిల్, బాల మోహన్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

ఆత్మ నిర్భర్ భారత్‌పై ఔరంగబాద్‌లో అంతర్జాతీయ సదస్సు

● పాల్గొన్న ఎంజీయూ ప్రొఫెసర్

మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆకుల రవి

రామగిరి, జనవరి 23: ఔరంగబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మరాట్‌వాడ యూనివర్సిటీ పరిధిలోని ఆర్‌జి బాగ్‌దీయా ఆర్ట్స్ కళాశాల- జల్నాలో సోమవారం ఆత్మ నిర్భర్ భారత్ అంశంపై ఇంటర్నేషనల్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంజీయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రవి హాజరై మాట్లాడారు. ఆత్మ నిర్భర్ భారత్‌తో దేశ ఆర్థిక వ్యవస్థను స్వయం సమృద్ధి పథంలో నడిపించడానికి దోహద పడుతుందని కొనియాడారు. కార్యక్రమంలో నేపాల్‌కు చెందిన ప్రొఫెసర్ ఆర్.ఎస్. ప్రధాన్, వివిధ యూనివర్సిటీల వీసీలు, కళాశాల ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మునుగోడు పోలీస్ స్టేషన్ తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మునుగోడు,జనవరి 23 : మునుగోడు పోలీస్‌స్టేషన్‌ను నల్ల